# శత వసంతంలోకి 'చిట్టి ఆంజనేయుడు'

- ప్రతిష్ఠ జరిగి 99 ఏళ్లు పూర్తి
- సీతారామమందిరంతో అనుబంధ ఆలయంగా భక్తుల ఆదరణ పొందుతున్న చిట్టి అంజనేయ స్వామి

**తెనాలి:** కళలకు కాణాచిగా.. ఆంధ్రాప్యారిస్‌గా విలసిల్లుతున్న తెనాలి ఆధ్యాత్మిక రంగంలోనూ వర్ధిల్లుతోంది. పట్టణ, పరిసరాల్లో పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పలు దేవాలయాలు భక్తుల కొంగుబంగారంగా అలరారుతున్నాయి. పట్టణ బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో గల చిట్టి అంజనేయస్వామి దేవాలయం ఇందులో ఒకటి. భక్తుల కోర్కెలు తీరుస్తున్న ప్రముఖ ఆలయంగా సేవలు అందుకుంటోంది. ప్రస్తుతం ఈ ఆలయం శతవసంతంలోకి అడుగుపెట్టింది.

**ఇదీ చరిత్ర...**

దేవాలయం ఉన్న ప్రదేశంలో పూర్వం ప్రభల వేంకటసుబ్బయ్య అనే భాగవతోత్తముడు నివసించేవారు. వృత్తిరీత్యా సర్వేయరు. ప్రవృత్తిరీత్యా పరమ భాగవతోత్తముడు. తంబురా మీటుతూ రాగనామ గానం చేస్తూ శ్రీరాముడిని ప్రచారం చేసేవారు. అప్పట్లో ఈ ప్రాంతం పట్టణ పొలిమేర. అనుశ్రుతంగా వస్తున్న కథనం ప్రకారం ఒకరోజు వేంకటసుబ్బయ్యకు స్వప్నంలో హనుమ సాక్షాత్కారం జరిగింది. అలాగే కొన్నిరోజులు వరుసగా స్వామి దర్శనమివ్వసాగారు. దీనిని భగవదాజ్ఞగా భావించిన ఆయన, మరికొందరు గ్రామస్తులు కలిసి, తన ఇంటికి దగ్గర్లోని రోడ్డుపక్కగా గల అశ్వత్థ వృక్షం (రావి చెట్టు)కింద అంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠకు పూనుకున్నారు.

**1924లో విగ్రహ ప్రతిష్ఠ..**

శ్రీచిత్రభాను నామ సంవత్సరం వైశాఖ బహుళ దశమి రోజున అంటే 1924 జూన్ అయిదో తేదీన బెల్లంకొండ స్వామీజీ అనే దిగంబర అవధూతచే తాంత్రిక విధానంలో ఆంజనేయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. స్వామి కేవలం అడుగున్నర



శ్రీచిట్టి అంజనేయస్వామి ఆలయం



1924లో దిగంబర అవధూత బెల్లంకొండ స్వామిచే శ్రీచిట్టి అంజనేయస్వామి ప్రతిష్ఠ (ఫైల్)

ప్రమాణంలో 'చిట్టి' రూపంలో ఉన్నందున క్రమంగా చిట్టి అంజనేయస్వామిగా భక్తులు పిలుచుకోవటం ఆరంభించారు. 1932లో ప్రభల వేంకటసుబ్బయ్య, ఆలయం ఎదురుగా చలువ పందిళ్లు వేసి శ్రీసీతారాముల కల్యాణం ఉత్సవాలను ప్రారంభించారు. ఉగాది రోజున అంకురార్పణ చేసి, నవమి వరకు రోజూ హరికథలు, సంగీత నృత్య కళాంశాలు, పురాణ ప్రవచనాలు ఏర్పాటుచేసి, నవమి నాడు వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తుల ఆదరణ పొందటంతో ఏటా కొనసాగించారు. చల్లపల్లి జమీందారు కుటుంబీకులు చాలాకాలం ఈ



వ్యవస్థాపకుడు ప్రభల వేంకటసుబ్బయ్య (ఫైల్)

కళ్యాణానికి కానుకలు పంపారు.

**1975 నుంచి మరో శకం..**

1975లో అర్చకస్వామిగా వచ్చిన దీవి సీతారామాచార్యులు నేతృత్వంలో ఈ ఆలయం మరో శకంలోకి అడుగిడింది. భక్తులతో ఆత్మీయంగా మెలుగుతూ వారి సహకారంతో మందిరానికి శ్లాబు, పిట్టగోడలు, దశావతారాలు, ఇతర దేవీ దేవతా బొమ్మ కట్టుబడి, మందిరం లోపల ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ వంటి అభివృద్ధి పనులు పూర్తిచేయించారు. ప్రతి మంగళవారం, శనివారం సామూహిక నాగవల్లీ సహస్రనామ పూజ, గారెల దండ పూజ, వాహన పూజలకు ఈ దేవాలయం ప్రసిద్ధి. తిరుపతి లడ్డూలా ఈ దేవాలయంలో నివేదించే నేతి అప్పం ఈ ప్రాంతంలో విశేషమైంది. ఆలయంలో 40 రోజులు దీక్షగా ప్రదక్షిణలు చేస్తే కోరికలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ప్రభల వేంకటసుబ్బయ్య 5వ తరానికి చెందిన ప్రభల వాసుదేవ శ్రీకార్తీకశర్మ ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

**రెండో భద్రాద్రిగా గుర్తింపు..**

తదనంతర కాలంలో చిట్టి అంజనేయస్వామి ఆలయం పక్కనే శ్రీసీతారామమందిరం ఏర్పాటైంది. పక్కనే గల గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సిబ్బంది, అక్కపెద్ది బాలగోపాల్ నేతృత్వంలో శ్రీసీతారామ మందిర నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయం ప్రతిష్ఠ 1975 జనవరి 8న చివుకుల వేంకట పూర్ణానందశాస్త్రి దంపతులచే నిర్వహించారు. అప్పట్నుంచి చిట్టి అంజనేయస్వామి గుడి వద్ద జరిగే శ్రీరామనవమి ఉత్సవాలు రామమందిరం వద్దకు మారాయి. అంకురార్పణ మాత్రం చిట్టి అంజనేయస్వామి గుడిలోనే ఇప్పటికీ జరుగుతున్నాయి. చలువ పందిళ్లలో హరికథ, శాస్త్రీయ నృత్యం, పురాణ ప్రవచనాలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో ఇక్కడ జరిగే సీతారామ కళ్యాణం రెండో భద్రాద్రి అన్నంత గుర్తింపును పొందింది.

**శతప్రతిష్ఠాపన మహోత్సవాలు..**

1984 నుంచి సీతారామ కల్యాణం అనంతరం పందిరి శాంతిగా చిట్టి అంజనేయస్వామికి తమలపాకులతో సహస్రనామ పూజ, అప్పాల నివేదన చేసి సహకార బ్యాంక్ వారిచే అన్నదానం జరుగుతోంది. 1981 నుంచి అర్చకత్వ బాధ్యతలు స్వీకరించిన శ్రీమాన్ అగ్నిహోత్రం నరసింహాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారామ మందిరం, దీవి సీతారామాచార్యులు 2015లో పరమపదించిన తర్వాత ఆయన కుమారులైన దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ షణ్ముఖ వర్ధన్‌ల ఆధ్వర్యంలో శ్రీచిట్టి అంజనేయస్వామి మందిరం అనుబంధ ఆలయాలుగా భక్తులకు ఆశీస్సులందిస్తున్నాయి. అక్కపెద్ది బాలగోపాల్, కల్లూరి సూర్యనారాయణమూర్తి, పిరాట్ల నారాయణమూర్తి, విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, ప్రభల సూర్యనారాయణమూర్తి వంటి పలువురు వదాన్యులైన భక్తులు సహకరిస్తున్నారు. 2024 సంవత్సరానికి ఆలయ ప్రతిష్ఠ జరిగి శతవసంతాలు పూర్తి కానున్నందున చైత్రశుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు త్రయాహ్నిక దీక్షతో శతప్రతిష్ఠాపన మహోత్సవాలు చేయాలని భావిస్తున్నట్టు యోగానంద చక్రవర్తి తెలియజేశారు.

## క్లుప్తంగా

### వృద్ధులకు అన్నదానం



**తెనాలిటౌన్:** బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా ఆశ్రమంలో శ్రీ వెంకటేశ్వరయ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగా సభ్యుడు ముద్దాభక్తుని భాస్కరరావు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ కాపు సేవాసమితి సెక్రటరీ ఐక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగ సభ్యులు ఆశ్రమాల్లో అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ముద్దాభక్తుని రాము, ఎం.శేక్సిత్, నిత్య శ్రావల్లి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

### పాఠశాలలకు చేరిన విద్యాకానుక కిట్లు




**తెనాలిఅర్బన్:** జగనన్న విద్యాకానుక కిట్లను స్టాక్ పాయింట్ల నుంచి ఆయా పాఠశాలలకు మంగళవారం విద్యాశాఖ అధికారులు పంపారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌కు ఉన్నతాధికారులు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక వాహనంలో వాటిని పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలకు పంపారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు అందజేయనున్నారు.

### డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం



**తెనాలిఅర్బన్:** 32వ యడ్లలింగయ్య కాలనీలోని రైల్వేగేటు నుంచి గుంటూరు ట్రాక్ వరకు ఉన్న మెయిన్ డ్రెయిన్ పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు. కాల్వలో ఉన్న వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్లపూడి రాజేశ్వరరావులు మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు చెప్పారు. డ్రెయిన్ వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుదాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



**తెనాలి:** స్థానిక గంగానమ్మపేటలోని ఆంధ్రాప్యారిస్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో జూనియర్స్‌లో ప్రథమ బహుమతిని దీప్తి, ద్వితీయ బహుమతిని శ్రీనిత్య, తృతీయ బహుమతిని సంజన గెలుచుకున్నారు. సీనియర్స్‌లో షేక్ లాస్య ప్రథమ, సాత్విక్ ద్వితీయ, అక్సా తృతీయ బహుమతిని గెలిచారు. సమీర, వర్షిణి, శ్రద్ధ ప్రత్యేక బహుమతులు పొందారు. సొసైటీ డైరెక్టర్ జయశేఖర్ మాట్లాడుతూ కళలపై తల్లిదండ్రులు ఈమధ్యకాలంలో చాలా శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. పిల్లలకు ఏదొక కళ నేర్పించాలనే వారు భావిస్తుంటే, పిల్లలు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. చిత్రలేఖనంతో సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారి విస్తరణపై అవగాహన

కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ నారాయణశర్మ

**మేడికొండూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్‌హెచ్–167 జాతీయ రహదారి విస్తరణ చేపట్టనున్నారు. మండల పరిధిలోని మంగళగిరిపాడు, కొర్రపాడు గ్రామాల పరిధిలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డెప్యూటీ కలెక్టర్ నారాయణశర్మ హాజరయ్యారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన పొలాల సేకరణ, మార్కెట్ విలువకు లోబడి రైతులకు పరిహారం అందించడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారి ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమార్, వీఆర్వో జోసఫ్, రైతులు పాల్గొన్నారు.

## 'క్షయ రహిత తెనాలి'లో భాగస్వాములు కావాలి

**తెనాలిఅర్బన్:** క్షయ వ్యాధిలేని తెనాలి రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ టి.రవికుమార్ కోరారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ సోకిన వారు వెంటనే టీబీ యూనిట్‌కు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్, డాక్టర్ దేవిక పాల్గొన్నారు.

## గంగమ్మ కొలుపుల మహోత్సవాలు



**తెనాలిటౌన్:** పట్టణ పరిధిలోని పినపాడులో పెరుగువారి ఇలవేల్పు గంగమ్మ కొలుపుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కొలుపుల్లో మంగళవారం గంగమ్మతల్లిని కనక తప్పెట్లు, మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. గుడి కమిటీ అధ్యక్షుడు పెరుగు మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకటస్వామి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, చిన్ని నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఆదినారాయణ, సత్యనారాయణ పర్యవేక్షించారు.

## ప్రతిరోజూ నడకతో బహుళ ప్రయోజనాలు

**తెనాలి:** నడకతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, దైనందిన జీవితంలో బిజీగా ఉండేవారు ప్రతిరోజూ కొంతసేపు నడవటం అలవరచుకుంటే ఆరోగ్యంగా ఉండగలరని ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కవిరాజ పార్కులోని వీజేజే భవన్‌లో ఏర్పాటైన సమావేశానికి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ బాబు 'మన ఆరోగ్యం కాపాడుకోవటం ఎలా?' అనే అంశంపై ప్రసంగించారు. క్యారెట్, క్యాబేజీ, కీరా వంటి పచ్చికూరగాయలు తింటూ, ఆహార నియమాలు పాటిస్తూ, ప్రతిరోజూ నడవటం వల్ల గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండి జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రతి ఆరోగ్య సమస్యకు మందులపై ఆధారపడొద్దని సూచించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో పాలడుగు ఆనందయ్య, టి.రత్తయ్య, సీహెచ్ అశోక్ కుమార్, మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.



డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడిని సత్కరించిన క్లబ్ బాధ్యులు

## కౌలు రైతు చట్టాన్ని సవరించాలి

**కొల్లిపర:** కౌలు రైతు చట్టాన్ని సవరించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన కొల్లిపర మండలంలో జరిగే జీపు యాత్రను కౌలు రైతులు జయప్రదం చేయాలని శివ సాంబిరెడ్డి ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అన్నవరపు లంక, అన్నవరపు గొడపాలెం, శివలూరు తదితర గ్రామాల్లో కౌలు రైతులతో సమావేశాలు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ భూమి యజమాని సంతకం అనే నిబంధన వలన కౌలు రైతులు కౌలు కార్డులు పొందలేక పంట రుణాలు, పంట నష్ట పరిహారాలు, పండిన పంటల కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోలేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని పైన తెలిపిన న్యాయమైన కోరికలు సాధన కోసం ఈ నెల 12వ తేదీన మంగళగిరి సీసీఎల్‌పి కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో మండలంలోని కౌలు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. జొన్న సాంబశివరావు, ఏమినేని గోవిందు, తాతా నరసింహారావు, ఉప్పాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, తోడేటి దాసు, దర్శి బర్నబా పాల్గొన్నారు.



కౌలు రైతులతో మాట్లాడుతున్న శివ సాంబిరెడ్డి

## హిందూ శ్మశానవాటికలో లైట్ ఏర్పాటు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక హిందూ శ్మశానవాటికలో మంగళవారం కార్పొరేషన్ నిధుల నుంచి ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికను దాతలు, కార్పొరేషన్ నిధులతో గతంలో అభివృద్ధి చేశామని, శ్మశానవాటికలో రాత్రి సమయంలో అసాంఘిక వ్యక్తులు మద్యం సేవించడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకువెళ్లామని వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవితో మాట్లాడి రూ.6లక్షల వ్యయంతో ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భవనం ప్రభాకర్‌రెడ్డి, చిన్ని, మేకా అంజిరెడ్డి, బొక్కా ప్రసన్నకుమార్ (నాని), ఎస్‌కె బషీర్, అన్నూరు సుబ్బారావు, భుజంగరావు, మురళి, మేకా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లైట్ ఆన్ చేస్తున్న దామేష్‌రెడ్డి

## రైలు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

**తాడేపల్లిరూరల్:** ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారివద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఈ దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 288 మందికిపైగా ఈ దుర్ఘటనలో మృతి చెందడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ సిగ్నల్ వ్యవస్థను కూడా ప్రైవేటుపరం చేయడం వలన రైలు ప్రమాదం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, సీనియర్ నాయకులు వై.కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, అమ్మిశెట్టి రంగారావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

## ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

**తెనాలిరూరల్:** నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యంగా పరిపాలన అందిస్తున్నానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సంగం జాగర్లమూడి గ్రామంలో గత నాలుగేళ్లలో రూ. 11 కోట్ల సంక్షేమ ఫలాన్ని గ్రామస్తులకు డీబీటీ పద్ధతిలో నేరుగా అందించినట్లు తెలిపారు. 227 కుటుంబాలకు వైఎస్సార్ కాపు నేస్తం అందుతోందని, 800కు పైగా పెన్షన్‌లు అందిస్తున్నామని చెప్పారు. 180 మందికి నివేశన స్థలాలు కేటాయించామని, వైఎస్సార్ చేయూత 419 మందికి అందుతోందని వివరించారు. సంక్షేమంతో పాటు గ్రామ అభివృద్ధికీ పెద్దపీట వేస్తున్నామని చెబుతూ గత మూడున్నరేళ్లలో సంగం జాగర్లమూడిలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. నాడు – నేడు పథకం కింద గ్రామంలోని పాఠశాలలను రూ. రెండు కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అర్హులైన ప్రజలకు సంక్షేమం పూర్తి స్థాయిలో అందిందా లేదా అన్న అంశాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్నామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యల ప్రస్తావనను నమోదు చేసుకుని రానున్న నాలుగు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో 86 శాతం కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. గ్రామ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, తహసీల్దార్ కె.రవిబాబు, పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు, పాటంశెట్టి నాగరాజు, దేవిరెడ్డి పూర్ణయ్య, పఠాన్ యాసిన్, గోగినేని సుబ్బారావు, అక్కిదాసు కిరణకుమార్, కఠారి హరీష్, బూరెల దుర్గ, నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.



వృద్ధుడికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

## కేఎల్‌యూకు 28వ ర్యాంకు

**తాడేపల్లిరూరల్ :** అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్ విశ్వవిద్యాలయానికి 28వ ర్యాంక్ వచ్చినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. మంగళవారం వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో 44వ ర్యాంక్‌ను, దేశంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లలో 52వ ర్యాంక్‌ను సాధించడంతోపాటు ఓవరాల్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో 50వ ర్యాంక్‌ను తమ విశ్వవిద్యాలయం సాధించిందని వివరించారు. భారతదేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 28వ ర్యాంక్ సాధించినందుకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ గుర్తింపు విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణల పట్ల తమ అచంచలమైన నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇది తమ విద్యాసంస్థలోని అంకితభావం కలిగిన అధ్యాపకుల సమష్టి కృషి, ప్రతిభావంతులైన విద్యార్థులు, సహాయక సిబ్బంది కలసి తమ విద్యాసంస్థను ఇంతటి గొప్ప విజయాన్ని తీసుకు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలపై దృష్టి సారించిన అధికారులు

- పలుచోట్ల మరమ్మతులు, కొత్తపైపులు ఏర్పాటు
- కొలనుకొండలో ఆరు పబ్లిక్ ట్యాప్‌లు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీటి సమస్యలపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్ల నుంచి సరిగా తాగునీరు సరఫరా కాకపోవడంతో వాటికి మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కొలనుకొండలో అస్లర్‌నగర్‌లో పబ్లిక్ ట్యాప్‌లు లేకపోవడంతో స్థానికంగా ఉన్నవారు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ఆరు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ వార్డులో పలు ప్రాంతాల్లోనూ, పద్మశాలీయులబజారులో పాత పైపులైన్లు నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహానాడు ప్రాంతంలో రూ.10 లక్షల వ్యయంతో పలుచోట్ల కొత్త పైపులైను పనులు ప్రారంభించారు. 2వ వార్డులో నెమలికంటి సత్యవతి ఇంటి వద్ద నుంచి సాయి ఇంటి వరకు రూ.5 లక్షల వ్యయంతో కొత్త పైపులైను పనులు చేపట్టారు. ఈ పనులన్నీ రెండు రోజుల్లో పూర్తిచేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.



కొత్తగా ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ ట్యాప్ నుంచి నీరు పట్టుకుంటున్న స్థానికులు

## దాడి ఘటనపై పరస్పర కేసులు

**తెనాలిరూరల్:** దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బీసీ కాలనీ రెల్ల బజారులో భార్య భర్తల వివాదం గురించి మాట్లాడేందుకు ఇద్దరి తరపు బంధువులు సోమవారం రాత్రి వెళ్లారు. ఈక్రమంలో చర్చలు ఘర్షణకు దారితీయగా పరస్పర దాడికి పాల్పడ్డారు. రాత్రి పొద్దుపోయాక రెండు పక్షాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు.

## వరిగడ్డి వామి దగ్ధం

రూ.2లక్షల ఆస్తి నష్టం

**మంగళగిరి:** నగరంలోని ద్వారకానగర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 12 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ద్వారకానగర్‌కు చెందిన కుర్రా బాబు గేదెల మేత కోసం 12 ఎకరాల వరిగడ్డి కొని వామి వేసుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి వరిగడ్డి వామికి మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే వరిగడ్డి పూర్తిగా కాలి బూడిద కాగా సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు బాబు తెలిపాడు.

